




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక    PEN POWER TELUGU DAILY    ప్రశ్నించడం మన హక్కు



సంపుటి : 11 సంచిక : 296 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 2 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 296 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 2 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur




# సోషల్ మీడియాను ఆయుధంగా వాడండి

## వైసీపీ యువజన విభాగంతో అధినేత జగన్ కీలక సమావేశం
## ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను యువత ప్రశ్నించాలని పిలుపు
## పార్టీని క్షేత్రస్థాయి నుంచి పటిష్టం చేయడంపై దృష్టి పెట్టాలని దిశానిర్దేశం

**పెన్ పవర్ డెస్క్:**ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడంలో యువత కీలక పాత్ర పోషించాలని వైసీపీ అధినేత జగన్ పిలుపునిచ్చారు. అన్యాయాలను, అక్రమాలను ప్రజల దృష్టికి తీసుకురావడానికి సోషల్ మీడియాను ఒక శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. ఈరోజు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలతో జరిగిన సమావేశంలో జగన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... యువజన విభాగం పార్టీలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాలని జగన్ అన్నారు. పార్టీని క్షేత్రస్థాయి నుంచి వ్యవస్థీకృతంగా బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని, ఈ బాధ్యతలో యువత ముందుండాలని దిశానిర్దేశం చేశారు. "కష్టపడి పనిచేస్తే మిమ్మల్ని నాయకులుగా తీర్చిదిద్దే బాధ్యత నాది. రాజకీయంగా ఎదగడానికి యువతకు ఇది ఒక గొప్ప అవకాశం. సమర్థత ఉన్నవారిని గుర్తించి పార్టీ వ్యవస్థల్లోకి తీసుకురండి" అని జగన్ వారికి భరోసా ఇచ్చారు. యువజన విభాగం పనితీరును మరింత మెరుగుపరిచేందుకు జోన్ల వారీగా వర్కింగ్ ప్రెసిడెంట్లను నియమిస్తున్నామని, ఇటీవల ఎన్నికల్లో పోటీ చేసిన యువ నేతలు ఈ బాధ్యతలు చూస్తారని ఆయన వెల్లడించారు.

వివరాలు 2లో..



# రాజకీయ ముసుగులో దోపిడీని సహించను

- కొవ్వూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన, లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ల పంపిణీ
- గత ప్రభుత్వంలో పింఛన్ల పేరుతో దోపిడీ జరిగిందని ఆరోపణ
- రాష్ట్రంలో పింఛన్ల కోసం నెలకు రూ.2,750 కోట్లు ఖర్చు చేస్తున్నామని వెల్లడి
- ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, త్వరలో నిరుద్యోగ భృతి
- 2027 నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని స్పష్టం
- పేదరిక నిర్మూలనకు 'పీ4' అనే కొత్త విధానం తీసుకొచ్చామని ప్రకటన

**పెన్ పవర్ డెస్క్:**ప్రతినెలా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీ చేస్తుండటంతో గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నామని, గత ప్రభుత్వంలో జరిగిన మోసాలకు, అక్రమాలకు చరమగీతం పాడుతున్నామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం కొవ్వూరు నియోజకవర్గం లోని మలకపల్లిలో నిర్వహించిన 'పేదల సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేశారు.

వివరాలు 2లో..



# ఆ రోజు ఏం జరిగిందంటే?

## ఆపరేషన్ సిందూర్-ట్రంప్ జోక్యంపై జైశంకర్ వివరణ

- భారత్-పాక్ యుద్ధం ఆపానన్న ట్రంప్ వాదనలో నిజం లేదన్న జైశంకర్
- అమెరికా అధ్యక్షుడి ప్రచారాన్ని తోసిపుచ్చిన జైశంకర్
- మే 9న పాక్ దాడి, భారత్ దీటైన జవాబు ఇచ్చిందన్న మంత్రి
- పాకిస్థానే నేరుగా కాల్పుల విరమణకు ముందుకొచ్చిందని వెల్లడి
- పహల్గామ్ దాడిని ఆర్థిక యుద్ధంగా అభివర్ణన
- ఉగ్రవాద నిర్మూలనలో అణు బెదిరింపులకు లొంగబోమని స్పష్టీకరణ

వివరాలు 2లో..



# చరిత్రలో తొలిసారి.. సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు!



- సిబ్బంది నియామకాలు, ప్రమోషన్లలో కొత్త విధానం
- ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 7.5 శాతం కోటా కేటాయింపు
- జూన్ 23 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త రూల్స్

**పెన్ పవర్ డెస్క్:**దేశ అత్యున్నత న్యాయస్థానం భారత సుప్రీంకోర్టు చరిత్రలో ఒక కీలకమైన, చారిత్రక నిర్ణయం తీసుకుంది. స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్లకు తొలిసారిగా,

వివరాలు 2లో..

# ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత

- సోమవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మిక మరణం
- హైదరాబాద్‌లో తుదిశ్వాస విడిచిన పట్టాభిరామ్
- ప్రముఖ ఇంద్రజాలికుడిగా, సైకాలజిస్టుగా గుర్తింపు
- వ్యక్తిత్వ వికాస ప్రసంగాలతో తెలుగువారికి సుపరిచితులు



**పెన్ పవర్ డెస్క్:**ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, బహుముఖ ప్రజ్ఞాశా లి బీవీ పట్టాభిరామ్ (75) కన్నుమూశారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లో ఆయన గుండెపోటుతో తుదిశ్వాస విడిచారు. తన మాటలతో లక్షలాది మందిలో స్ఫూర్తి నింపిన పట్టాభిరామ్ ఆకస్మిక మరణం అందరినీ దిగ్భ్రాంతికి గురిచేసింది. బీవీ పట్టాభిరామ్ కేవలం వ్యక్తిత్వ వికాస నిపుణుడిగానే కాకుండా, పేరుగాంచిన ఇంద్రజాలికుడిగా, మానసిక నిపుణుడిగా కూడా తెలుగు ప్రజలకు సుపరిచితులు. అనేక పుస్తకాలు, టెలివిజన్ కార్యక్రమాలు, వేలాది ప్రసంగాల ద్వారా ఆయన సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించేందుకు విశేష కృషి చేశారు. క్లిష్టమైన మానసిక శాస్త్ర అంశాలను సైతం సామాన్యులకు అర్థమయ్యేలా సులభమైన శైలిలో వివరించడం ఆయన ప్రత్యేకత.

# వైసీపీ నేత వల్లభనేని వంశీకి బెయిల్..

- వల్లభనేని వంశీకి భారీ ఊరట... కానీ, ఫుల్ టెన్షన్
- వంశీకి నకిలీ పట్టాల కేసులో బెయిల్
- మొత్తం 10 కేసుల్లోనూ బెయిల్ రావడంతో విడుదలయ్యే అవకాశం
- షరతులతో బెయిల్ ఇచ్చిన నూజివీడు కోర్టు
- వంశీ బెయిల్ రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం పిటిషన్
- ప్రభుత్వ పిటిషన్‌పై రేపు విచారణ జరపనున్న సర్వోన్నత న్యాయస్థానం

వివరాలు 2లో..



# పట్టాభిరామ్ గారి మృతి దిగ్భ్రాంతికి గురి చేసింది

- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ కన్నుమూత
- గుండెపోటుతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన నారా లోకేశ్



**పెన్ పవర్ డెస్క్:** ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ బీవీ పట్టాభిరామ్ కన్నుమూశారు. గుండెపోటుతో ఆసుపత్రిలో చేరిన ఆయన, చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మెజీషియన్, హిప్నాటిస్టు, రచయిత, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్‌గా ఆయన తెలుగు ప్రజలకు సుపరిచితులు. ఆయన మరణ వార్తతో వ్యక్తిత్వ వికాస రంగంలో విషాదం నెలకొంది. పట్టాభిరామ్ మరణం పట్ల ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన అందించిన సేవలను స్మరించుకుంటూ సోషల్ మీడియా వేదికగా నివాళులర్పించారు. "ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, మెజీషియన్ బీవీ పట్టాభిరామ్ గారి

వివరాలు 2లో..

# సింగయ్య మృతి కేసు.. జగన్‌కు హైకోర్టులో తాత్కాలిక ఊరట

- రెండు వారాల పాటు తదుపరి చర్యలు నిలిపివేస్తూ హైకోర్టు స్టే
- కేసును కొట్టివేయాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన జగన్
- సాక్ష్యాలు సమర్పించేందుకు సమయం కోరిన అడ్వకేట్ జనరల్
- జగన్‌పై అరెస్ట్ వంటి చర్యలు వద్దన్న ఉన్నత న్యాయస్థానం




**పెన్ పవర్ డెస్క్:**వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. పల్నాడు జిల్లాలో సింగయ్య అనే వృద్ధుడి మృతికి సంబంధించిన కేసులో ఆయనపై తదుపరి చర్యలు తీసుకోకుండా రెండు వారాల పాటు స్టే విధిస్తూ న్యాయస్థానం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసుకు సంబంధించి తనపై నమోదైన

వివరాలు 2లో..

# అవును.. నేను అదృష్టవంతుడినే

## లాటరీ తగిలిందన్న వ్యాఖ్యలపై సిద్ధరామయ్య స్పందన



- ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అదృష్టవంతుడంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ వ్యాఖ్య
- అవును, అదృష్టం వల్లే ముఖ్యమంత్రిని అయ్యానని బదులిచ్చిన సిద్ధరామయ్య
- ఇళ్ల కేటాయింపుల్లో అవినీతి జరిగిందంటూ పాటిల్ ఆరోపణలు
- మరికొందరు ఎమ్మెల్యేల నుంచి కూడా ప్రభుత్వ తీరుపై అసంతృప్తి గళం

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# బ్రేక్ తాత్కాలికమేనా?

బనకచర్ల ప్రాజెక్టుకు బ్రేకులు పడ్డాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలను కేంద్రం తిరస్కరించింది. బనకచర్లకు అనుమతి ఇవ్వలేమని కేంద్ర ప్రభుత్వం తేల్చి చెప్పింది. బనకచర్లకు పర్యావరణ అనుమతులు తిరస్కరించిన కేంద్రం ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ సర్కార్ పంపిన ప్రతిపాదనలను వెనక్కు తిప్పి పంపింది. అయితే ఇది తాత్కాలిక బ్రేకులా? లేక శాశ్వతంగా అనుమతులు ఇవ్వరా? అన్నది తేలాల్సి ఉంది. కానీ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యానే బనకచర్లకు అనుమతులు ఇవ్వకోవడానికి ప్రధాన కారణంగా తెలుస్తుంది. అందుకే ఏపీ ప్రభుత్వానికి చెందిన నేతలు మాత్రం ఇది తాత్కాలిక బ్రేకులేనని, ఖచ్చితంగా బనకచర్ల ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెబుతున్నారు.

**గేమ్ ఛేంజర్ గా భావించి...**

బనకచర్ల ప్రాజెక్టును చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. దీనిని గేమ్ ఛేంజర్ గా చంద్రబాబు అభివర్ణించారు. గోదావరిలో వృధాగా తరలిపోయే నీటిని పోలవరం ప్రాజెక్టు ద్వారా కాల్వల ద్వారా రాయలసీమతో పాటు కోస్తాంధ్రలోని అన్ని జిల్లాలకు మళ్లించాలన్నది చంద్రబాబు ఆలోచన. ఈ ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ రతనాల సీమగా మారుతుందని చంద్రబాబు నాయుడు పదే పదే చెబుతున్నారు. పోలవరం - బనకచర్ల లింక్ ప్రాజెక్టు కోసం ఎనభైవేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశార. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ, టీడీపీ కలసి ఉండటంతో సులువుగా అనుమతులు సాధించవచ్చని భావించి ఈ ప్రాజెక్టుకు సంబంధించి డీపీఆర్ ను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి సమర్పించారు.

**రాజకీయంగా అగ్గి రాజుకోవడంతో...**

అయితే బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణలో రాజకీయంగా అగ్గి రాజుకుంది. తమకు న్యాయంగా దక్కాల్సిన గోదావరి నీటిని అక్రమంగా ఏపీ ప్రభుత్వం తరలించుకుపోతుందని తెలంగాణలోని అన్ని పార్టీలు ఆందోళనకు దిగాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లి కేంద్ర మంత్రులను కలసి వచ్చారు. మరొకవైపు తెలంగాణ బీజేపీ నేతలు కూడా పార్టీ నాయకత్వంపై వత్తిడి తెచ్చారు. బనకచర్లకు అనుమతులు మంజూరు చేస్తే ఆ ప్రభావం తెలంగాణ రాజకీయాల్లో పడే అవకాశముందని పార్టీ పెద్దలకు నచ్చచెప్పడంలో సక్సెస్ అయ్యారు. అందుకే పర్యావరణ అనుమతులు ఇవ్వలేమంటూ కేంద్ర, అటవీ పర్యావరణ మంత్రిత్వ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది.

**అభ్యంతరాలు వ్యక్తం కావడంతో...**

తెలంగాణ నుంచి అనేక అభ్యంతరాలు ప్రాజెక్టుపై వ్యక్తమయ్యాయి. నీటి కేటాయింపులకు విరుద్ధమంటూ ఢిల్లీ స్థాయిలోనూ, రాష్ట్ర స్థాయిలోనూ గళమెత్తారు. వరద జలాలపై సమగ్ర అధ్యయనం చేయాలంటూ డిమాండ్ చేశారు. అందుకే ముందుగా అంతరాష్ట్ర అనుమతులు ప్రాజెక్టుకు పొందాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ స్పష్టం చేసింది. దీంతో పాటు ఇప్పుడున్న పరిస్థితుల్లో నిధుల కేటాయింపు కూడా కష్టసాధ్యమవుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం ఎన్నికలు పూర్తయి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై పునరాలోచించే వీలుందని హస్తిన వర్గాలు చెబుతున్నాయి. బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతిస్తే తెలంగాణలో రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందని భావించి బ్రేకులు వేసిందన్నది వాస్తవం.

# రాజకీయ ముసుగులో దోపిడీని సహించను

- మొదటి పేజీ తరువాయి

సానమాంద్ర పోశిబాబు అనే లబ్ధిదారుడికి చర్మకార పింఛను, గెద్దం కృష్ణదుర్గకు వితంతు పింఛను అందజేసి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

**పింఛన్ల పంపిణీలో దేశంలోనే ఏపీ ముందుంది**

గత ప్రభుత్వంలో ఉద్యోగులకు జీతాలు, రిటైర్డ్ ఉద్యోగులకు పింఛన్లు సక్రమంగా అందేవి కావని, కానీ తమ ప్రభుత్వం వచ్చాక ఒకటో తేదీనే అందిస్తున్నామని చంద్రబాబు తెలిపారు. తాను గతంలో రూ.200 ఉన్న పింఛనును రూ.2,000 చేశానని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు రూ.4,000కు పెంచామని గుర్తుచేశారు. "డయాలసిస్ రోగులకు రూ.10 వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు అందిస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్నాం. పింఛన్ల కోసం నెలకు రూ.2,750 కోట్లు ఖర్చు చేస్తున్నాం. తెలంగాణ, కేరళ వంటి పెద్ద రాష్ట్రాలు కూడా ఈ విషయంలో మన దరిదాపుల్లో లేవు" అని ఆయన వివరించారు.

**గత పాలనపై తీవ్ర విమర్శలు**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అరాచకాలు పెరిగాయని, వ్యవస్థలన్నీ విధ్వంసానికి గురయ్యాయని చంద్రబాబు ఆరోపించారు. "రాజకీయ ముసుగులో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసేవారిని ఉపేక్షించను. గత ప్రభుత్వంలో వైకల్యం లేనివారికి కూడా పింఛన్లు ఇచ్చి ప్రజాధనాన్ని దోచేశారు. గంజాయి బ్యాచ్‌ను పరామర్శించే వారిని ఏమనాలో ప్రజలే ఆలోచించాలి. గంజాయి, డ్రగ్స్ అమ్మితే తాట తీస్తాం," అని హెచ్చరించారు. వివేకానంద రెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ, గుండెపోటు అని చెప్పి తననే నమ్మించారని, ఆనాడే నిందితులను అరెస్టు చేసి ఉంటే రాష్ట్రానికి ఈ దుస్థితి పట్టేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

**అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కీలక ప్రకటనలు**

రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తున్నామని ముఖ్యమంత్రి అన్నారు. నెల రోజుల్లో మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, వీలైనంత త్వరగా నిరుద్యోగ భృతికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని, ఈ ఏడాది డిసెంబర్‌కల్లా డయాఫ్రం వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తామన్నారు.

**పేదరిక నిర్మూలనకు 'పీ4' విధానం**

పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా 'పీ4' (ప్రభుత్వం-ప్రైవేటు-ప్రజలు-పరోపకారం) విధానానికి శ్రీకారం చుట్టినట్లు చంద్రబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల చదువు మధ్యలోనే ఆపేసిన మూలపర్తి నవ్యశ్రీ అనే విద్యార్థిని తన గోడును వెళ్లబోసుకుంది.

దీనికి తక్షణమే స్పందించిన ఠాకూర్ లేబొరేటరీస్ ప్రతినిధి, ఆ అమ్మాయి చదువుతో పాటు ఉద్యోగ బాధ్యతలను తమ సంస్థ తీసుకుంటుందని ప్రకటించారు. దీనిపై సీఎం హర్షం వ్యక్తం చేస్తూ, సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్నవారు పేద కుటుంబాలను ఆదుకోవాలని పిలుపునిచ్చారు. కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక హామీలిచ్చారు. ఇక్కడ డిగ్రీ కాలేజీ ఏర్పాటు, ప్రభుత్వాసుపత్రిని 150 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తామని, లిఫ్ట్ ఇరిగేషన్ పనులన్నీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# సోషల్ మీడియాను ఆయుధంగా వాడండి

- మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకుంటూ యువతలో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశారు. "పార్టీ పెట్టినప్పుడు నేను, మా అమ్మ మాత్రమే ఉన్నాం. నాపై అభిమానంతోనే ఎందరో నాతో కలిసి నడిచారు. ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నాం. 2014లో 67 మంది ఎమ్మెల్యేలతో గెలిస్తే, వారిలో 23 మందిని లాక్కున్నారు. అయినా విలువలు, విశ్వసనీయతకు కట్టుబడి ఉన్నాం" అని జగన్ అన్నారు. ఉప ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచిన విషయాన్ని, 18 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి గెలిపించుకున్న సందర్భాన్ని ఆయన ప్రస్తావించారు. రాజకీయాల్లో నాయకులకు ప్రజలతో సంబంధాలు అత్యంత ముఖ్యమని

జగన్ ఉద్బోధించారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా వారికి తోడుగా నిలబడాలని, మంచి పలకరింపుతో వారి మనసులను గెలుచుకోవాలని సూచించారు. "ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి. వారి సమస్యల్లో అండగా నిలిచినప్పుడే నాయకులుగా ఎదుగుతారు. మీ పనితీరును ఎప్పటికప్పుడు మీరే సమీక్షించుకోవాలి" అని ఆయన హితవు పలికారు.

# వైసీపీ నేత వల్లభనేని వంశీకి బెయిల్..

వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ఒకేరోజు ఊరట, ఉత్కంఠ ఎదురయ్యాయి. తనపై నమోదైన అన్ని కేసుల్లోనూ బెయిల్ లభించడంతో ఆయన విడుదలకు మార్గం సుగమమైందని భావిస్తున్న తరుణంలోనే, ఆయన బెయిల్‌ను రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించడం తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. ఈ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం రేపు విచారణ చేపట్టనుండటంతో వంశీ భవితవ్యం ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది.

వివరాల్లోకి వెళితే, ఏలూరు జిల్లా నూజివీడు కోర్టులో నమోదైన నకిలీ ఇళ్ల పట్టాల కేసుకు సంబంధించి ఈరోజు నూజివీడు కోర్టు వంశీకి బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయల విలువైన రెండు పూచీకత్తులు సమర్పించాలని, వారానికి రెండుసార్లు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని న్యాయస్థానం షరతులు విధించింది. ఈ కేసుతో కలిపి తనపై నమోదైన మొత్తం 10 కేసుల్లోనూ వంశీకి బెయిల్ లభించినట్లయింది. దీంతో ఆయన జైలు నుంచి విడుదల కావడం ఖాయమని ఆయన వర్గీయులు భావించారు. అయితే, వంశీకి లభించిన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై రేపు విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఒకవైపు కింది కోర్టుల్లో అన్ని కేసుల్లోనూ బెయిల్ లభించినప్పటికీ, మరోవైపు సుప్రీంకోర్టులో ప్రభుత్వ పిటిషన్ విచారణకు రానుండటంతో ఆయన విడుదల ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. రేపటి విచారణలో సుప్రీంకోర్టు ఇచ్చే ఆదేశాలపైనే వంశీ విడుదల ఆధారపడి ఉంది. గత ఫిబ్రవరి 13న హైదరాబాద్‌లోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న మైహోం భుజా అపార్ట్‌మెంట్‌లో

వల్లభనేని వంశీని విజయవాడ పటమట పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కిడ్నాప్, దాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ ఆరోపణలతో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద ఆయనపై కేసులు నమోదు చేశారు. ఆ తర్వాత ఆయనపై వరుసగా మరికొన్ని కేసులు నమోదయ్యాయి. అనారోగ్య సమస్యలతో ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ, కోలుకున్న తర్వాత తిరిగి జైలుకే తరలించారు. అప్పటి నుంచి ఆయన బెయిల్ కోసం ప్రయత్నిస్తూ రాగా, తాజాగా అన్ని కేసుల్లోనూ ఊరట లభించింది. అయితే, సుప్రీంకోర్టులో ప్రభుత్వ పిటిషన్ రూపంలో మరో న్యాయపోరాటం ఆయన ముందు నిలిచింది.

# అవును.. నేను అదృష్టవంతుడినే

కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో అసమ్మతి సెగలు రాజుకుంటున్నాయి. సొంత పార్టీ నేతల నుంచి వస్తున్న విమర్శలు అధికార పార్టీని ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కేవలం అదృష్టం వల్లే ఆ పదవిలో ఉన్నారంటూ ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలకు, ముఖ్యమంత్రి అంతే ఘాటుగా సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ మంగళవారం మాట్లాడుతూ, "సిద్ధరామయ్యకు లాటరీ తగిలింది. ఆయన్ను సోనియాగాంధీకి పరిచయం చేసిందే నేను. ఆయన అదృష్టం బాగుండి ముఖ్యమంత్రి అయ్యారు. నాకు ఏ గాడ్ ఫాదర్ లేరు. నేను పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సూర్జేవాలాను కలిసి చెప్పాల్సిందంతా చెప్పా. ఏం జరుగుతుందో చూద్దాం" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యల వీడియో బయటకు రావడంతో రాజకీయ దుమారం రేగింది.

ఈ విమర్శలపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనదైన శైలిలో స్పందించారు. "అవును.. నేను అదృష్టవంతుడినే. అందుకే ముఖ్యమంత్రి పదవిలో కూర్చున్నాను" అని బదులిచ్చారు.

**అసలేం జరిగింది?**

తన నియోజకవర్గమైన అలంద్‌లో పేదలకు ఇళ్ల కేటాయింపులో అవినీతి జరిగిందని ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ ఇటీవల ఆరోపణలు చేశారు. అయితే, ఈ ఆరోపణలను గృహనిర్మాణ శాఖ మంత్రి జమీర్ అహ్మద్ ఖాన్ ఖండించారు. కేటాయింపులన్నీ పారదర్శకంగానే జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఈ వివాదం తర్వాత మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజు కాజే, బేలూర్ గోపాలకృష్ణ కూడా తమ ప్రభుత్వంపై అసంతృప్తిని వెళ్లగక్కారు.

**రంగంలోకి అధిష్ఠానం**

ఎమ్మెల్యేల నుంచి వరుసగా అసమ్మతి స్వరాలు వినిపిస్తుండటంతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. పరిస్థితిని చక్కదిద్దేందుకు పార్టీ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సూర్జేవాలాను బెంగళూరుకు పంపింది. ఆయన అసంతృప్త ఎమ్మెల్యేలతో చర్చలు జరిపారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రంలో నాయకత్వ మార్పు ఉండదని తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి మార్పుపై వస్తున్న ఊహాగానాల వెనుక బీజేపీ కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న గ్యారంటీలు నిలిచిపోవాలనే దురుద్దేశంతోనే బీజేపీ ఇలాంటి ప్రచారాలు చేస్తోందని ఆయన విమర్శించారు.

# ఆ రోజు ఏం జరిగిందంటే?

భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఆ ప్రచారాన్ని ఆయన పూర్తిగా ఖండించారు. కాల్పుల విరమణ ఒప్పందం వెనుక జరిగిన అసలు వాస్తవాలను ఆయన ఒక అంతర్జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. న్యూయార్క్ కేంద్రంగా పనిచేసే 'న్యూస్‌వీక్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో జైశంకర్ మాట్లాడుతూ, మే 9వ తేదీ రాత్రి జరిగిన పరిణామాలను గుర్తుచేసుకున్నారు. "ఆ రోజు రాత్రి అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫోన్ చేశారు. ఆ సమయంలో నేను ప్రధానితో పాటే ఉన్నాను. పాకిస్థాన్ నుంచి భారత్‌పై పెద్ద ఎత్తున దాడి జరిగే ప్రమాదం ఉందని వాన్స్ హెచ్చరించారు. ఒకవేళ పాక్ దుస్సాహసానికి పాల్పడితే అందుకు తగిన రీతిలో, దీటుగా బదులిస్తామని మోదీ ఆయనకు స్పష్టం చేశారు" అని జైశంకర్ తెలిపారు. ఆ తర్వాత జరిగిన ఘటనలను వివరిస్తూ "అనుకున్నట్టే ఆ రాత్రి పాకిస్థాన్ భారత్‌పై భారీ దాడికి తెగబడింది. అయితే, భారత బలగాలు ఆ దాడులను అత్యంత సమర్థవంతంగా, వేగంగా తిప్పికొట్టాయి" అని జైశంకర్ పేర్కొన్నారు. కాల్పుల విరమణకు దారితీసిన పరిస్థితులను ఆయన విడమరిచి చెప్పారు. ఆ మరుసటి రోజు ఉదయం అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తనకు ఫోన్ చేసి, పాకిస్థాన్ చర్చలకు సిద్ధంగా ఉందని చెప్పినట్లు జైశంకర్ వెల్లడించారు. అయితే, ఆ తర్వాత కీలక పరిణామం చోటుచేసుకుందని ఆయన అన్నారు. "అదే రోజు మధ్యాహ్నం, పాకిస్థాన్ మిలటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీఎంవో) మేజర్ జనరల్ ఖసిఫ్ అబ్దుల్లా, భారత డీజీఎంవో రాజీవ్ ఘాయ్‌కు నేరుగా ఫోన్ చేశారు. కాల్పుల విరమణ ఒప్పందం పాటిద్దామని ప్రతిపాదించారు. అసలు జరిగింది ఇది" అని జైశంకర్ తేల్చిచెప్పారు. వాణిజ్యానికి, కాల్పుల విరమణకు భారత్ పరంగా ఎలాంటి సంబంధం లేదని ఆయన కుండబద్దలు కొట్టారు.

**పహల్గామ్ దాడి ఆర్థిక యుద్ధమే**

ఇదే ఇంటర్వ్యూలో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని జైశంకర్ ఒక 'ఆర్థిక యుద్ధ చర్య'గా అభివర్ణించారు. కశ్మీర్ లోయలో అభివృద్ధిని, శాంతిని ఓర్వలేకే ఉగ్రవాదులు ఈ దాడికి పాల్పడ్డారని ఆయన అన్నారు. "జమ్మూకశ్మీర్‌లో పర్యాటక రంగాన్ని దెబ్బతీయాలనే దురుద్దేశంతోనే ఈ దాడి చేశారు. మత ఘర్షణలు రెచ్చగొట్టేందుకు, పర్యాటకుల మతం అడిగి మరీ వారిని కాల్చి చంపారు. ఈ ఘటన తర్వాత ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని మేం నిర్ణయించుకున్నాం" అని తెలిపారు. ఉగ్రవాదులకు, వారికి అండగా నిలిచే ప్రభుత్వాలకు భారత్ తగిన బుద్ధి చెబుతుందని, ఉగ్రవాదాన్ని అణిచివేసే క్రమంలో ఎలాంటి అణ్వస్త్ర బెదిరింపులకు లొంగే ప్రసక్తే లేదని ఆయన గట్టిగా హెచ్చరించారు.

## చరిత్రలో తొలిసారి.. సుప్రీంకోర్టు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు!

- మొదటి పేజీ తరువాయి

తన సిబ్బంది నియామకాలు మరియు పదోన్నతుల్లో షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు రిజర్వేషన్ల విధానాన్ని అధికా రికంగా అమలు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా సామాజిక న్యాయం, సమాన ప్రాతినిధ్యం దిశగా సుప్రీంకోర్టు ఒక బలమైన ముందడుగు వేసినట్లయింది. ఈ కొత్త విధానాన్ని అమలు చేస్తూ జూన్ 24న సుప్రీంకోర్టు ఒక అంతర్గత సర్క్యులర్‌ను జారీ చేసింది. ఈ సర్క్యులర్ ప్రకారం, రిజర్వేషన్ల విధానం జూన్ 23, నుంచే అమల్లోకి వచ్చినట్లు స్పష్టం చేశారు. దీని ప్రకారం, కోర్టులో ప్రత్యక్ష నియామకాలు, పదోన్నతుల ద్వారా భర్తీ చేసే పోస్టుల్లో ఎస్సీ వర్గాలకు 15 శాతం, ఎస్టీ వర్గాలకు 7.5 శాతం కోటా వర్తిస్తుంది. ఈ రిజర్వేషన్ల అమలు కోసం రూపొందించిన 'మోడల్ రిజర్వేషన్ రోస్టర్', సంబంధిత రిజిస్టర్ల వివరాలను కోర్టు అంతర్గత నెట్‌వర్క్ అయిన 'సుప్‌నెట్'లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ రిజర్వేషన్ విధానం సుప్రీంకోర్టులోని రిజిస్ట్రార్లు, సీనియర్ పర్సనల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ లైబ్రేరియన్లు, జూనియర్ కోర్టు అసిస్టెంట్లు, ఛాంబర్ అటెండెంట్లు వంటి పలు స్థాయిల్లోని పోస్టులకు వర్తించనుంది. ఈ ప్రక్రియలో పూర్తి పారదర్శకత పాటించేందుకు కూడా చర్యలు తీసుకున్నారు. విడుదల చేసిన రిజర్వేషన్ జాబితాలో ఏవైనా లోపాలు ఉన్నాయని భావిస్తే, సిబ్బంది తమ అభ్యంతరాలను నేరుగా రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) దృష్టికి తీసుకురావచ్చని సర్క్యులర్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ బీఆర్ గవాయి హయాంలో ఈ చారిత్రక నిర్ణయం వెలువడటం గమనార్హం. షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిని అధిష్టించిన రెండో వ్యక్తిగా జస్టిస్ గవాయి చరిత్ర సృష్టించారు. ఆయన పదవీకాలంలోనే అత్యున్నత న్యాయస్థానంలో రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

## సింగయ్య మృతి కేసు.. జగన్‌కు హైకోర్టులో తాత్కాలిక ఊరట

- మొదటి పేజీ తరువాయి

ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ జగన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై మంగళవారం విచారణ జరిగింది. జగన్ తరపు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ, ఈ కేసులో సెక్షన్‌ను బీఎన్ఎస్ కింద 105కు మార్చారని, అందువల్ల తదుపరి చర్యలు, అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని అభ్యర్థించారు. మరోవైపు, ప్రభుత్వ తరపున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ, ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఆధారాలు, ఇతర సాక్ష్యాలను కోర్టు ముందు ఉంచేందుకు తమకు రెండు వారాల సమయం కావాలని కోరారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, రెండు వారాల పాటు ఈ కేసులో ఎలాంటి తదుపరి చర్యలు చేపట్టవద్దని పోలీసులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

**అసలేం జరిగిందంటే?**

ఇటీవల పల్నాడు జిల్లా, సత్తెనపల్లి మండలం, రెంటపాళ్ల గ్రామంలో వైఎస్ జగన్ పర్యటించినప్పుడు ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. జగన్ ప్రయాణిస్తున్న కారు కింద పడి సింగయ్య అనే వృద్ధుడు మరణించారు. మొదట కాన్వాయ్‌లోని మరో వాహనం ఢీకొట్టిందని వార్తలు వచ్చినా, కొద్ది రోజుల తర్వాత జగన్ ప్రయాణిస్తున్న కారు కిందే ఆయన పడినట్లుగా ఉన్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమయ్యాయి. ఈ వీడియోల ఆధారంగా పోలీసులు మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును రద్దు చేయాలని జగన్ హైకోర్టును ఆశ్రయించగా, ప్రస్తుతం ఆయనకు తాత్కాలిక ఊరట లభించింది.

## పట్టాభిరామ్ గారి మృతి దిగ్భ్రాంతికి గురి చేసింది

- మొదటి పేజీ తరువాయి

మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మెజీషియన్‌గా, హిప్నాటిస్టుగా, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్‌గా బీవీ పట్టాభిరామ్ ఎనలేని సేవలు అందించారు. వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని లోకేశ్ తన ఎక్స్ ఖాతాలో పేర్కొన్నారు. పట్టాభిరామ్ కేవలం వ్యక్తిత్వ వికాస నిపుణుడిగానే కాకుండా రచయితగానూ విశేష కీర్తిని గడించారు. తెలుగుతో పాటు ఇంగ్లిష్, కన్నడ, తమిళ భాషల్లోనూ ఆయన అనేక పుస్తకాలు రచించారు. ఒత్తిడిని జయించడం, ఆత్మవిశ్వాసం, మానవ సంబంధాలు వంటి అంశాలపై భారత్‌తో పాటు అమెరికా, ఆస్ట్రేలియా, సింగపూర్ వంటి పలు దేశాల్లో వేలాది వర్క్‌షాపులు నిర్వహించి లక్షలాది మందిలో స్ఫూర్తి నింపారు. హిప్నోసిస్‌పై ఆయన చేసిన కృషికి గాను ఫ్లోరిడా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పట్టా పొందిన ఆయన, సైకాలజీ, ఫిలాసఫీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్లలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే), రాష్ట్ర పోలీసు అకాడమీ, షార్ శ్రీహరికోట, డీఆర్‌డీఎల్, భారత్ డైనమిక్స్, ఎన్ఐఆర్‌డీ సహా అనేక ప్రతిష్ఠాత్మక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు ఆయన గౌరవ సలహాదారుగా సేవలు అందించారు. ఆయన మృతి వ్యక్తిత్వ వికాస రంగానికి తీరని లోటని పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.

# ఆర్సీబీ న్యూసెన్స్ చేసింది.. పోలీసులపై ట్రైబ్యునల్ ఆసక్తికర వ్యాఖ్యలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** బెంగళూరులోని చినస్వామి స్టేడియంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ విజయోత్సవ వేడుకల సందర్భంగా జరిగిన తొక్కిసలాట తీవ్ర విషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో 11 మంది ప్రాణాలు కోల్పోగా అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటన పెను దుమారం రేపింది. ఈ సమయంలో ఈ ఘటనకు సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ సంచలన వ్యాఖ్యలు చేసింది.అవును... బెంగళూరులో ఇటీవల చోటుచేసుకున్న తొక్కిసలాట ఘటనకు సంబంధించి సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రైబ్యునల్ (సీఏటీ) కీలక వ్యాఖ్యలు చేసింది. ఇందులో భాగంగా... అక్కడ లక్షల సంఖ్యలో అభిమానులు గుమిగూడటానికి 'రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు'నే కారణమని ప్రాథమికంగా తెలుస్తోందని పేర్కొంది. ఈ సందర్భంగా ఓ ఐపీఎస్ అధికారి సస్పెన్షన్ ను రద్దు చేసింది.

ఈ సందర్భంగా స్పందించిన ట్రైబ్యునల్... మూడు నుంచి ఐదు లక్షల మంది ప్రజలు గుమిగూడటానికి ఆర్సీబీనే కారణమని ప్రాథమికంగా తెలుస్తోందని తెలిపింది. పోలీసుల నుంచి అవసరమైన అనుమతులు లేదా సమ్మతిని వాళ్లు తీసుకోలేదని వ్యాఖ్యానించింది. అకస్మాత్తుగా సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో భారీ సంఖ్యలో అభిమానులు అక్కడికి తరలివచ్చారని పేర్కొంది.ఇదే సమయంలో... పోలీసు సిబ్బంది కూడా మనుషులేనని.. వారు దేవుళ్లు లేదా ఇంద్రజాలికులు కాదని.. వేలు రుద్దడం ద్వారా ఎలాంటి కోరికనైనా తీర్చగల 'అల్లాదీన్ అద్భుత దీపం' వంటి మాయా శక్తులు కూడా వారికి లేవని వ్యాఖ్యానించింది. సుమారు 12 గంటల తక్కువ సమయంలో భద్రతా ఏర్పాట్లు చేస్తారని పోలీసుల నుంచి ఆశించలేమని ట్రైబ్యునల్ పేర్కొంది.జూన్ 4, 2025న సమయం లేకపోవడం వల్ల పోలీసులు తగిన ఏర్పాట్లు చేయలేకపోయారని.. పోలీసులకు తగినంత సమయం ఇవ్వలేదని చెబుతూ.. బెంగళూరు పోలీసు అధికారి వికాస్ కుమార్ తన సస్పెన్షన్ ను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్ ను విచారించినప్పుడు ట్రిబ్యునల్ ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా ఆ ఐపీఎస్ అధికారి సస్పెన్షన్ ను రద్దు చేసింది.

# కొబ్బరి ముంజలు.. బెజవాడి కుర్రాడి ఐడియాకు మార్కెట్ ఫిదా



పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలన్నారు పెద్దలు. ఆ మాటను పక్కాగా ఫాలో అయ్యాడు విజయవాడకు చెందిన కుర్రాడు వికాస్. రైతు కుటుంబం నుంచి వచ్చిన అతగాడి పూర్వీకులు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన వారు. కొబ్బరి మీద వారికి సహజంగా ఉండే అభిమానంతో దాన్నే తన వ్యాపారంగా మార్చుకున్నాడు. 2019లో కొబ్బరిపొడి పరిశ్రమను ఏర్పాటు చేసి.. కోట్లాది రూపాయిల్ని పోగొట్టుకున్నాడు. అయినా వెనక్కి తగ్గని అతడు కొబ్బరి ముంజ కాన్సెప్టుకు తెర తీయటమే కాదు.. కొబ్బరితో దాదాపు పదుల సంఖ్యలో ఉత్పత్తుల్ని మార్కెట్లోకి తేవటం ద్వారా.. కొబ్బరి రైతులకు ఆదాయం వచ్చేలా చేయటమే కాదు.. కోట్లాది రూపాయిలు సంపాదిస్తున్న అతగాడి సక్సెస్ స్టోరీ.. కొత్త స్ఫూర్తిని ఇస్తుందని చెప్పక తప్పదు.విజయానికి ముందు ఓటమి పరీక్ష పెడుతుంది. దాన్నికష్టంతో సమాధానమిస్తూ.. సహనంతో అధిగమిస్తే అనూహ్య ఫలితాలు ఖాయం. వికాస్ అదే పని చేశాడు. కోస్తా జిల్లాల వారికి తాటి ముంజల గురించి తెలిసిందే. కూల్ యాపిల్ గా పలువురు పిలుచుకునే తాటి ముంజల మాదిరి..కొబ్బరితో కోకో ముంజ్ ను తయారు చేస్తే? సరిగ్గా ఇలాంటి ఐడియాతో పాటు.. కొబ్బరితో 60కు పైగా పదార్థాల్ని తయారు చేయటం ద్వారా అటు ఆరోగ్యం.. ఇటు వ్యాపారాన్ని మరో స్థాయికి తీసుకెళ్లాలన్న విజయవాడ యువకుడి కలకు ఇప్పుడు సానుకూల ఫలితాలు వస్తున్నాయి.


క్రిష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లిలో ఫ్యాక్టరీని ఏర్పాటు చేసి.. వినూత్న పద్ధతిలో కొబ్బరితో చేస్తున్న 60 రకాలు ఇప్పుడు అందరిని ఆకర్షిస్తున్నాయి. త్వరలో దేశ వ్యాప్తంగా ప్రముఖ దుకాణాల్లోనూ వీటిని అందుబాటులోకి తెచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ఎలాంటి రంగు.. రసాయనాల్ని కలపకుండా కేవలం కొబ్బరి నీళ్లను ప్రాసెస్ చేసి తాటి ముంజల్ని తలపించేలా తయ్యా చేస్తున్నారు. కోల్డ్ బ్రూస్ కాఫీని మామూలు నీళ్లతో తయారు చేస్తే.. ఇతగాడు మాత్రం కొబ్బరి నీళ్లతో చేయటం గమనార్హం. కొబ్బరి తురుము.. పాలు.. నీటితో 20కు పైగా వెరైటీ ఫుడ్ లను.. 40 రకాల కేక్ లు.. మిల్క్ షేక్ లు.. ఐస్ క్రీములు.. బిస్కెట్లు.. కాఫీ లాంటి పదార్థాల్ని తయారు చేస్తూ.. అందరిని ఆకర్షిస్తున్నాడు.

సాధారణంగా కాఫీని మామూలు పాలతో కలిసి చేస్తారు. వికాస్ మాత్రం కొబ్బరి పాలతో చిక్కని కాఫీ తయారు చేస్తారు. ఈ కాఫీకి మరో స్పెషల్ ఉంది. అదేమంటే..ఈ కాఫీలో పంచదార కాకుండా.. కొబ్బరి గెల నుంచి వచ్చే నీరాతో చేసిన చక్కెర.. తేన వేయటం ద్వారా భిన్నమైన రుచిని తీసుకొచ్చి.. అందరి మనసుల్ని దోచేస్తున్నాడు. తన ఉత్పత్తులతో అటు ఆరోగ్యం.. ఇటు అనారోగ్యానికి చెక్ పెట్టేలా సిద్ధం చేయటం ఇస్పెషల్ గా చెప్పాలి.కొబ్బరితో రక్తంలో చక్కెర స్థాయిల్ని నియంత్రించేలా చేసి షుగర్ కు చెక్ పెట్టటం.. నీరసం.. మలబద్ధకం.. థైరాయిడ్ సమస్యలకు చెక్ పెట్టేలా తన ఉత్పత్తులు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొబ్బరి నీళ్లతో చెడు కొవ్వు కరిగేలా చేయటంతో పాటు.. కిడ్నీలో రాళ్లు కరిగించే శక్తి ఉంటుంది కొబ్బరి పాలలో ఫైబర్ అధికంగా ఉండటంతో జీవక్రియ మరింత మెరుగవుతుంది. ఇలా ఆరోగ్యానికి మేలు చేసే అంశాలతో తన ఉత్పత్తుల్ని సిద్ధం చేసిన వికాస్.. ఇప్పుడు అందరిని ఆకర్షిస్తున్నాడు. అతడు మరిన్ని విజయాల్ని సొంతం చేసుకోవాలని ఆశిద్దాం.

# 'మొత్తం సెట్ చేశా.. ఇక దిగిపోతా'.. బోయింగ్ టాప్ ఆఫీసర్ కీలక వ్యాఖ్యలు!

సంక్షోభంలో చిక్కుకున్న విమాన తయారీ సంస్థను నిలబెట్టడానికి గత సంవత్సరం అమెరికా కార్పొరేట్ చరిత్రలో అతిపెద్ద నిధుల సేకరణలలో ఒకదానిని నిర్వహించడంలో కీలక భూమిక పోషించిన చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బ్రియాన్ వెస్ట్ పదవి నుంచి తప్పుకుంటున్నట్లు బోయింగ్ కంపెనీ తెలిపింది. ఆగస్టు మధ్యలో వెస్ట్ ఈ పదవి నుంచి వైదొలుగుతున్నారని వెల్లడించింది.అవును... అమెరికాకు చెందిన విమాన నిర్మాణసంస్థ బోయింగ్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ బ్రియాన్ వెస్ట్ తన పదవి నుంచి వైదొలుగుతున్నట్లు సంస్థ ప్రకటించింది. గతేడాది బోయింగ్ సంస్థ సంక్షోభంలో ఉన్న సమయంలో నిధుల సేకరణలో అయన కీలక పాత్ర పోషించారని తెలిపింది! ఆయన స్థానంలో లాక్ హీడ్ మార్టిన్ కార్ప్ మాజీ ఎగ్జిక్యూటివ్ జీసస్ జే మాలావే బాధ్యతలు స్వీకరించనున్నారు.బోయింగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కెల్లీ ఓర్ట్ బర్గ్ బ్రియాన్ వెస్ట్ సలహాదారుగా కొనసాగుతారని సంస్థ వెల్లడించింది. ఈ రెండు చర్యలు ఆగస్టు 15 నుండి అమల్లోకి వస్తాయని కంపెనీ తెలిపింది. ఈ సందర్భంగా స్పందించిన వెస్ట్... బోయింగ్ లో ప్రస్తుతం బ్యాలెన్స్ షీట్ బలంగా, నిర్వహణ సామర్థ్యం మెరుగ్గా ఉండడంతో తాను పదవి నుంచి దిగిపోవడానికి ఇదే సరైన సమయమని అన్నారు.గత సంవత్సరం తీవ్ర సమ్మె తర్వాత ఉత్పత్తిలో తీవ్ర మందగమనం కారణంగా రేటింగ్ లు దారుణమైన స్థితికి దిగజారకుండా ఉండటానికి.. నిధుల సమీకరణ చేపట్టడంలో వెస్ట్ కీలక భూమిక పోషించారు. %వి%24 బిలియన్ల ఈక్విటీ అమ్మకంతో బోయింగ్ నగదు నిల్వలను పెంచడంలో ఆయన పాత్ర కీలకం. దీంతో ఈ సంవత్సరం ఇప్పటి వరకు ఆ సంస్థ స్టాక్ 18% లాభపడింది.

# రోజు రోజుకీ పెరుగుతున్న అక్రమ సంబంధాలకు ఇవే అసలు కారణాలు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇటీవల కాలంలో వివాహేతర సంబంధాలు విపరీతంగా పెరిగిపోతున్న సంగతి తెలిసిందే! అంతే కాకుండా.. వాటి కారణంగా జరుగుతున్న నేరాలు, ఘోరాలూ మరింత ఆందోళనకరంగా మారుతున్నాయి. పైగా గత కొన్ని నెలలుగా వరుసగా ఈ తరహా ఘటలను తెరపైకి వస్తున్నాయి. ఈ సమయంలో... ఈ అక్రమ సంబంధాలు విపరీతంగా పెరిగిపోవడానికి గల కారణాలు ఏమిటనేది ఇప్పుడు చూద్దామ్...!

అవును... అక్రమ సంబంధాల వ్యవహారాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయి! వీటి ఫలితంగా జరుగుతున్న నేరాలు, ఘోరాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. వీటి కారణంగా నాశనం అవుతున్న వారి జీవితాల సంగతి అలా ఉంచితే... బంగారు భవిష్యత్తు ఉన్న పిల్లల జీవితాలను అందకారంలోకి నెట్టేస్తున్నాయి. పాపం పుణ్యం ఎరుగని వయసులో వారి మనసుల్లో తీవ్రమైన అలజడిని, ఆందోళనను సృష్టిస్తున్నాయి.

ఇలా రోజు రోజుకీ పెరిగిపోతూ, తీవ్ర ఆందోళన కలిగిస్తున్న అక్రమ సంబంధాలకు ప్రత్యేకంగా ఒకటే కారణం అని ఉండదని అంటున్నారు నిపుణులు. ఇందులో పలు కారణాలు శరీరానికి సంబంధించినవి అయితే.. మరిన్ని కారణాలు మనసుకు సంబంధించినవని చెబుతున్నారు. ఈ విషయంలోఈ ఆడ, మగా అనే తేడాలేమీ ఉండవని, ఇద్దరివైపు నుంచి కారణాలుంటాయని అంటున్నారు.

ఇందులో ప్రధానంగా... భార్యాభర్తల మధ్య భావోద్వేగ సాన్నిహిత్యం కొరవడటం ఒక కారణమని నిపుణులు చెబుతున్నారు. ఇద్దరి మధ్య ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడం, వినకపోవడం, అభినందించకపోవడం వంటివి బయట సాన్నిహిత్యాన్ని కోరుకునేలా చేస్తాయి. భర్త లేదా భార్య నుండి తగినంత ప్రేమ, శ్రద్ధ, గౌరవం లభించడం లేదని భావించినప్పుడు, ఆ ఖాళీని మరొకరితో నింపుకోవాలని చూస్తారు.ఇదే క్రమంలో... లైంగిక కోరికలు తీరకపోవడం లేదా భాగస్వామితో శారీరక సాన్నిహిత్యం తగ్గిపోవడం కూడా ఈ అక్రమ సంబంధాలకు మరో ప్రధాన కారణం అని అంటున్నారు. అదే విధంగా... మరికొంతమంది దంపతుల్లో కొత్తదనం కోరుకోవడం, ఉత్సాహం ఆశించడం కూడా దీనికి దారితీయవచ్చని చెబుతున్నారు.

దీంతో... కాలక్రమేణా భాగస్వాముల మధ్య ఎమోషన్స్ కరువవ్వడం, మానసిక దూరం పెరగడం, కమ్యూనికేషన్ లేకపోవడం, భావాలను పంచుకోలేకపోవడం, ఒకరు పంచుకున్నా మరొకరు అర్థం చేసుకోకపోవడం జరుగుతుందని.. దీని తదుపరి దశ అక్రమ సంబంధాలేనని చెబుతున్నారు. ఇలా అటు శారీరక, మానసిక సమస్యల ఫలితమే వీటికి ప్రధాన కారణమని చెబుతున్నారు.

ఇదే సమయంలో.. ఇతరులను చూసి, కొత్త కొత్త కోరికలు పెంచుకుని, వాటిని తీర్చుకోవడానికి ఆర్థిక స్థోమత సరిపడక పలువురు ఈ మార్గాలను ఎంచుకుంటారని చెబుతున్నారు. ఇటువంటి ఘటనలు ఇటీవల కాలంలో పెరిగిపోతున్నాయని చెబుతున్నారు. ఇలా.. నేటి సమాజంలో మానవ సంబంధాల మధ్య పెరిగిపోతున్న అర్థిక సంబంధాలు ఒక ప్రధన కారణమని అంటున్నారు.

**పరిష్కార మార్గాలు:**

భాగస్వామిపై కాకుండా మరొకరిపైకి ఆలోచనలు మళు తున్నప్పుడు ఎవరికి

వారే స్వీయ నియంత్రణ పాటించేలా ప్రయత్నించాలి. ఇలాంటి వాటిని ప్రోత్సహించే స్నేహితులకు దూరంగా ఉండే ప్రయత్నాలు చేయాలి. ఇక అక్రమ సంబంధాలు బయటపడినప్పుడు.. నిపుణులు కౌన్సెలింగ్, థెరపీని సిఫార్సు చేస్తారు. ఇది జంటల మధ్య బంధాన్ని పునర్నిర్మించుకోవడానికి సహాయపడుతుంది.

# మళ్ళీ పాదయాత్ర... జగన్ సంచలన ప్రకటన వెనక ?



**హైదరాబాద్ పెన్ పవర్:** ంవైసీపీ అధినేత వైఎస్ జగన్ మరోసారి పాదయాత్రకు సిద్ధపడుతున్నారు. ఈ మేరకు ఆయన సంచలన ప్రకటనను వైసీపీ యూత్ లీడర్ల సమీక్షా సమావేశంలో ప్రకటించారు. డేట్ టైం చెప్పలేదు కానీ పాదయాత్ర కచ్చితంగా ఉంటుందని స్పష్టంగా చెప్పేశారు. ఆయన పార్టీ యువజన విభాగం నాయకులతో మాట్లాడుతూ తాను జిల్లాల పర్యటనలు చేస్తూ ఉంటాను అని చెప్పారు. అదే సమయంలో పాదయాత్ర కూడా చేస్తాను అని జగన్ కీలక ప్రకటన చేశారు.రాబోయే ఎన్నికల ముందు తాను పాదయాత్ర చేస్తానని జగన్ స్పష్టం చేశారు. అంతే కాదు పార్టీ సోషల్ మీడియా వింగ్ ను పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలని ఆయన కోరారు. ఈ రోజులలో ఫోన్ ఒక బ్రహ్మాండమైన ఆయుధమని ఆయన యువతకు చెప్పారు.

పార్టీ కార్యకర్తలకు ఎవరికైనా అన్యాయం జరిగితే సోషల్ మీడియాలో వెంటనే పోస్ట్ చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఇక తాను చేపట్టబోయే పాదయాత్రలో సోషల్ మీడియా యాక్టివిస్టులందరినీ కలుస్తానని వారిని పేరు పేరునా పిలుస్తాను అని జగన్ చెబుతూ వారిలో హుషార్ కలుగజేశారు.ఇవన్నీ పక్కన పెడితే తాజాగా జగన్ చేసిన ప్రకటనతో ఏపీలో మరో భారీ పాదయాత్ర అన్నది తథ్యమని అర్థం అవుతోంది. ఇక జగన్ పాదయాత్ర చేయడం ఇదే తొలిసారి కాదు, ఆయన 2017 నవంబర్ 6 నుంచి 2019 జనవరి 9 వరకూ ఏకంగా పదిహేను నెలల పాటు భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మూడు వేల ఏడు వందల కిలోమీటర్ల మేర ఏపీ అంతా తిరిగారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం దాకా జగన్ పాదయాత్ర సాగింది.ఆ పాదయాత్ర ఫలితమే ఆయనకు 2019 ఎన్నికల్లో 151 సీట్లను అందించింది. ఆయన ప్రజలతో మమేకం అయిన తీరుకు మంచి స్పందన లభించింది. ప్రజల మధ్య నుంచే తన ఎన్నికల మేనిఫెస్టో ఉంటుందని చెప్పి ఆనాడు జగన్ పాదయాత్రలో ఇచ్చిన హామీల నుంచే తన నవరత్నాల పథకాలను తయారు చేశారు. వాటికి మంచి స్పందన లభించడం తోనే ఆయన అధికారం అందుకున్నారు.నిజం చెప్పాలంటే వైసీపీ రాజకీయ ప్రస్థానంలో జగన్ పాదయాత్ర ఒక మైలురాయిగా ఉంటుంది. మరి అలాంటి పాదయాత్ర మరోసారి చేస్తాను అని జగన్ అంటున్నారు. ఈసారి ఎలాంటి ప్రభావం ఉంటుంది అన్నదే చర్చగా ఉంది. ఎందుకంటే జగన్ 2017లో పాదయాత్ర చేసినపుడు ఆయన సీఎం కాలేదు. ఆయన పాలన గురించి ఎవరికీ తెలియదు. ఈసారి ఆయన పాలన మీద ఒక అభిప్రాయం అయితే ఉంది.అయితే జగన్ పాదయాత్రలో పాల్గోనే వర్గాల బట్టి రూట్ మ్యాప్ బట్టి ఆయన ఈసారి టార్గెట్ చేసేది ఏమిటి అన్నది అర్థం అవుతుంది అంటున్నారు. గ్రామీణ ప్రాంతాలు వైసీపీకి బలంగా ఉంటాయి. అందువల్ల ఆయన పాదయాత్ర ఆ విధంగా డిజైన్ చేస్తారా అన్న చర్చ ఉంది.ఇక ఎన్నికలకు చాలా దూరం ఉంది. గట్టిగా నాలుగేళ్ళ పాటు ఉంది. అందువల్ల జగన్ పాదయాత్ర గురించి ప్రకటించారు కానీ బహుశా అది 2027 చివరిలో ఉండవచ్చు అని అంటున్నారు. అంటే 2029 మేలో జరిగే సార్వత్రిక ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఉండొచ్చు అని చెబుతున్నారు. పాదయాత్రలో జన సమూహాలతో కలవాలని అనుకుంటుండం వల్లనే ఇప్పటి నుంచే పెద్దగా ప్రజల వద్దకు వెళ్ళడం లేదని చర్చ సాగుతోంది.ఈ రోజునే అందరికీ కలిస్తే ఆనాటికి ఆ ఊపు తగ్గుతుందని వూహంతోనే తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు అని అంటున్నారు. అంతే కాదు జిల్లాల పర్యటనలు కూడా పరిమితంగా చేసుకుంటూ ఈ రెండేళ్ళ పాటు మెల్లగా వైసీపీ రథాన్ని ముందుకు పోనీయాలని కూడా ప్రణాళిక ఉన్నట్లుగా తెలుస్తోంది.ఇక ఏపీలో పాదయాత్రలు ఎపుడూ సక్సెస్ అవుతూనే వచ్చాయి. పాదయాత్ర చేసిన వారికి అధికారం దక్కింది. అది వైఎస్సార్ చంద్రబాబు, జగన్ లోకేష్ ఇలా అందరూ పాదయాత్ర చేసి పదవులు అందుకున్న వారే. దాంతో మరోసారి పాదయాత్ర అని జగన్ అంటున్నారు. మరి ఏపీ రాజకీయాల్లో ఇది ఏ మేరకు ప్రభావం చూపిస్తోందో చూడాలి.

# ఆ బిగ్ లక్కీ హ్యాండ్.. బీజేపీకి కాబోయే జాతీయ అధ్యక్షుడు?




**హైదరాబాద్ పెన్ పవర్:** నితిన్ గడ్కరీ.. రాజ్ నాథ్ సింగ్.. అమిత్ షా.. ఇలా బీజేపీలో అధ్యక్షులుగా అందరు అగ్ర నాయకుల వంతు ముగిసింది.. జేపీ నడ్డా కూడా పొడిగింపుపై ఉన్నారు. వరుసపెట్టి రాష్ట్రాల్లో విజయాలు సాధిస్తూ.. కేంద్రంలోనూ మూడోసారి అధికారంలో కొనసాగుతూ దేశంలో హవా సాగిస్తోంది కమలం పార్టీ. నిజానికి నిరుడు ఈ రోజుల్లోనే బీజేపీ జాతీయ అధ్యక్ష పదవికి ఎన్నిక జరగాలి. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిగా రాబోయేది ఎవరు? అనే ఆసక్తి నెలకొంది. అదే సమయంలో మధ్యప్రదేశ్ మాజీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు ఖాయమైందనే కథనాలు వచ్చాయి. కానీ, ఆయన్ను కేంద్రంలో కీలకమైన వ్యవసాయ శాఖకు మంత్రిగా నియమించారు. ఇక ఇప్పుడు మరి కాబోయే అధ్యక్షుడు ఎవరు..?సోమవారం ఏపీ, తెలంగాణ రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల ఎన్నిక పూర్తయింది. మరో నాలుగు రాష్ట్రాలకూ సారథి ఎవరనేది తేలే అవకాశం ఉంది. ఆ పార్టీ రాజ్యాంగం మేరకు జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ప్రారంభానికి ముందే కనీసం 19 రాష్ట్రాల శాఖలకు అధ్యక్షుడిన ఎన్నుకోవాలి. ఇప్పటికి 16 మంది కొత్త అధ్యక్షులు అయ్యారు. మంగళవారం మరో మూడు రాష్ట్రాలకూ ప్రకటించే వీలుంది.ఇక మిగిలింది జాతీయ అధ్యక్షుడి ఎన్నికే. ప్రస్తుతం జేపీ నడ్డా ఆ బాధ్యతల్లో ఉన్నారు. కేంద్ర మంత్రిగానూ విధులు నిర్వర్తిస్తున్నారు. కాబట్టి నడ్డా మళ్లీ కొనసాగడం కష్టమే. చౌహాన్ తో పాటు గడ్కరీ కూడా ఇప్పటికే జాతీయ అధ్యక్ష బాధ్యతలు చూశారు. అందుకని హరియాణా మాజీ సీఎం ఖట్టర్, ధర్మేంద్ర ప్రధాన్ తో పాటు భూపేంద్ర యాదవ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.వీరిలో భూపేంద్రకే ఎక్కువ చాన్స్ ఉన్నట్లు స్పష్టం అవుతోంది. ఈయన ఇంచార్జిగా వ్యవహరించిన పలు రాష్ట్రాల్లో బీజేపీ తిరుగులేని విజయం సాధించింది. గత ఏడాది మహారాష్ట్ర ఎన్నికల్లో అఖండ విజయానికి తెరవెనుక సారథి భూపేంద్రనే. యూపీ, రాజస్థాన్, బిహార్ లలో పార్టీ ఎన్నికల బాధ్యుడిగా విజయంలో తనవంతు పాత్ర పోషించారు ఆయన. అందుకనే భూపేంద్ర యాదవ్ నే పార్టీ జాతీయ అధ్యక్షుడు చేస్తారని ఢిల్లీ బీజేపీ వర్గాలు గట్టిగా చెబుతున్నాయి.

భూపేంద్ర వయసు 56 ఏళ్లే. రాజస్థాన్ కు చెందినవారు. కేంద్ర పర్యావరణ, అడవులు, కార్మిక శాఖ మంత్రిగా పనిచేస్తున్నారు.

# ఇండియాలో సిరీస్ గెలవాలి.. రిటైర్మెంట్‌పై 556 టెస్ట్ వికెట్ల వీరుడు ఆసక్తికర వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆస్ట్రేలియా దిగ్గజ స్పిన్నర్ నాథన్ లియాన్ 37 ఏళ్ళ వయసులో కూడా టెస్ట్ క్రికెట్ లో సత్తా చాటుతూ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. మ్యాచ్ ఎక్కడ జరిగినా కూడా ఆసీస్ తుది జట్టులో లియాన్ ఉండాల్సిందే. షేన్ వార్న్ రిటైర్మెంట్ ప్రకటించినప్పటి నుంచి 14 ఏళ్లుగా కంగారూల జట్టు స్పిన్ బాధ్యతలను ఒంటి చేత్తో మోస్తున్నాడు. కెరీర్ లో 138 టెస్టులు.. 556 వికెట్లు.. ఎన్నో మ్యాచ్ విన్నింగ్ ఘనతలు.. ఒక ఆటగాడిగా ఇంతకన్నా ఏం కావాలి. వయసు మీద పడడంతో ఈ ఆసీస్ వెటరన్ స్పిన్నర్ టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ఇస్తాడేమో అనే అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి.

లియాన్ తాజాగా తన రిటైర్మెంట్ పై వస్తున్న వార్తలను కొట్టిపారేశాడు. 37 ఏళ్ల ఈ అనుభవజ్ఞుడు తన కెరీర్ ముగిసేలోపు ఇంగ్లాండ్, ఇండియాలో సిరీస్ గెలవడంతో పాటు మరో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్ గెలవాలనే లక్ష్యాలను పెట్టుకున్నాడు. 2023లో భారత్‌తో జరిగిన ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో ఆస్ట్రేలియా తొలిసారి డబ్ల్యూటీసీ గెలిచినప్పుడు లియాన్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. గత నెలలో లార్డ్స్‌లో సౌతాఫ్రికాపై జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓడిపోయింది. లియాన్ మాట్లాడుతూ.. "నేను ఎప్పుడూ ఇండియాలో సిరీస్ గెలవాలని లక్ష్యంగా పెట్టుకుంటాను. ఇండియాతో పాటు ఇంగ్లాండ్ లోనూ గెలవాలి. కొన్ని సార్లు సిరీస్ గెలిచే అవకాశం వచ్చినా చేజారింది. ప్రతి టెస్ట్ కీలకంగా తీసుకోవాలి. సమ్మర్ లో జరగబోయే యాషెస్ నా ఆలోచనల్లో ఉంది. మరో ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ ఖచ్చితంగా ఆడాలనే లక్ష్యం ఉంది". అని లియాన్ తన రిటైర్మెంట్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

లియాన్ టెస్ట్ కెరీర్ విషయానికి వస్తే 138 టెస్టుల్లో 556 వికెట్లు పడగొట్టాడు. షేన్ వార్న్ (708), ఫాస్ట్ బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్ (563) తర్వాత ఆస్ట్రేలియన్ బౌలర్ల జాబితాలో మూడవ స్థానంలో నిలిచాడు. లియాన్ మరో 8 వికెట్లు పడగొడితే మెక్‌గ్రాత్ (563) ను వెనక్కి నెట్టి రెండో స్థానానికి చేరతాడు. ఓవరాల్ గా లియాన్ టెస్టు క్రికెట్ లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో ఏడో స్థానంలో కొనసాగుతున్నాడు.

# వన్డేల్లో నెంబర్ 1, టీ20 ల్లో నెంబర్ 3: టాప్ ఫామ్‌తో దూసుకెళ్తున్న స్మృతి మంధాన



**హైదరాబాద్ పెన్ పవర్:** మహిళా క్రికెట్ లో టీమిండియా ఓపెనర్.. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన తన హవా చూపిస్తుంది. ఫార్మాట్ ఏదైనా అత్యుత్తమంగా రాణిస్తుంది. ముఖ్యంగా వన్డే, టీ20 ఫార్మాట్ మంధానకు తిరుగులేకుండా పోతుంది. ఇటీవలే వన్డేల్లో నెంబర్ వన్ ర్యాంక్ కు చేరుకొని చరిత్ర సృష్టించిన ఈ టీమిండియా ఓపెనర్.. తాజాగా ప్రకటించిన మహిళా టీ20 ర్యాంకింగ్స్ లో 771 రేటింగ్ పాయింట్స్ తో మూడో స్థానానికి చేరుకుంది. ఇంగ్లాండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి టీ20లో సెంచరీతో చెలరేగింది. 62 బంతుల్లోనే 112 పరుగులు చేసి టీమిండియాకు ఒంటి చేత్తో విజయాన్ని అందించింది. మంధాన ఇన్నింగ్స్ లో 15 ఫోర్లతో పాటు 3 సిక్సర్లు ఉన్నాయి. తొలి టీ20 మ్యాచ్ కు ముందు వరకు నాలుగో స్థానంలో ఉన్న స్మృతి.. సెంచరీతో ఒక స్థానం ఎగబాకింది. ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ 794 రేటింగ్ పాయింట్లతో అగ్ర స్థానంలో ఉంది. హేలీ మాథ్యూస్ 774 రేటింగ్స్ తో రెండో స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ తో జరగబోయే మిగిలిన నాలుగు మ్యాచ్ ల్లోనూ రాణిస్తే మంధాన టాప్ ర్యాంక్ కు చేరే అవకాశం ఉంది. అదే జరిగితే వన్డే, టీ20 ర్యాంకింగ్స్ లో నెంబర్ ర్యాంక్ సాధించిన ప్లేయర్ గా సరికొత్త చరిత్ర సృష్టిస్తుంది. అక్టోబర్ 2024 తర్వాత తొలిసారిగా భారత టీ20 జట్టులో స్థానం సంపాదించిన ఓపెనర్ షఫాలీ వర్మ..టీ20 ర్యాంకింగ్స్ లో 13వ స్థానం నుండి 12వ స్థానానికి ఎగబాకింది. తొలి టీ20లో 22 బంతుల్లో 20 పరుగులు మాత్రమే చేసినప్పటికీ ఆమె ర్యాంక్ మెరుగవ్వడం విశేషం. జూలై 2023లో చివరి టీ20 ఆడి భారత జట్టుకు దూరమైన హర్లీన్ డియోల్ తొలి టీ20లో 23 బంతుల్లో 43 పరుగులు చేసి తిరిగి ర్యాంకింగ్స్ లో ప్రవేశించింది. టీ20 ర్యాంకింగ్స్ లో ఆమె 86 ర్యాంక్ లో నిలిచింది.

# నాలుగున్నర సంవత్సరాల రిలేషన్.. RCB స్టార్ పేసర్‌పై లైంగిక వేధింపుల కేసు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఐపీఎల్ ఆడుతూ తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న ఫాస్ట్ బౌలర్ యష్ దయాల్ చిక్కుల్లో పడ్డాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఒక మహిళ.. దయాల్ తనను మానసికంగా, శారీరకంగా వేధించాడని ఆరోపించింది. దయాల్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేయగా.. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కు కూడా అధికారిక ఫిర్యాదు అందింది. ఘజియాబాద్‌కు చెందిన బాధితురాలు.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి ఆన్‌లైన్ పోర్టల్‌లో యష్ దయాళ్ అనే క్రికెటర్‌పై ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదుల ప్రకారం.. యష్ దయాల్ ఇతర అమ్మాయిలతో కూడా తప్పుడు సంబంధాలలో పాల్గొన్నట్టు ఆరోపించింది.

ఆ మహిళ దయాళ్ తో నాలుగున్నర సంవత్సరాలకు పైగా సంబంధంలో ఉందని చెప్పుకొచ్చింది. ఈ సమయంలో ఈ ఆర్సీబీ ఫాస్ట్ బౌలర్ వివాహ హామీలతో తనను తప్పుదారి పట్టించడమే కాకుండా.. తనను ఊటీకి తీసుకెళ్లి తన నివాసంలో 15 రోజులు ఉండనిచ్చాడని ఆమె ఆరోపించింది. ఆమె తరచుగా అతని ఇంటికి వెళ్లి అతని కుటుంబంతో సమయం గడిపినట్టు తనను పెళ్లి చేసుకుంటానని యష్ దయాల్ హామీ ఇచ్చాడని ఆమె తెలిపింది. యాష్ దయాల్, అతని కుటుంబం వివాహ హామీ ఇవ్వడం ద్వారా ఆమె ఆశలు పెంచుకుంటూనే ఉందని తెలిపింది. అతని వ్యక్తిగత జీవితంలో తాను లోతుగా మునిగిపోయానని కూడా ఆమె అన్నారు. అయితే తాను పెట్టుకున్న ఈ నమ్మకాన్ని వమ్ము చేశాడని.. అదే సమయంలో దయాల్ చాలా మంది మహిళలతో సంబంధం కలిగి ఉన్నాడని ఆ మహిళ చెబుతుంది. ఏప్రిల్ 17, 2025న మరొక మహిళ ఆమెను సంప్రదించి, దయాల్ మోసం చేస్తున్నాడని.. అనేక మంది ఇతర మహిళలతో సంబంధాలు కలిగి ఉన్నాడని రుజువుగా చెప్పిందని తెలిసింది. ఆమె ఫిర్యాదు ప్రకారం దయాల్‌కు కనీసం ముగ్గురు ఇతర మహిళలతో సంబంధాలు ఉన్నాయనే ఆమె అనుమానాలను వ్యక్తం చేసింది. ఇటీవలే ముగిసిన ఐపీఎల్ 2025 లో ఆర్సీబీ తరపున యష్ దయాల్ 13 వికెట్లు పడగొట్టి జట్టుకు టైటిల్ తీసుకొని రావడంలో కీలక పాత్ర పోషించాడు.



మస్టర్డ్ చీరలో నిర్మలమైన రూఫ్‌టాప్ మూమెంట్‌ను పంచుకున్న మహిరా శర్మ

# డిమాండ్ చేయకపోయినా కీర్తి కెరీర్ ఇంకా అలాగే!



హీరోయిన్ గా సక్సెస్ అయితే పారితోషికం పరంగా వాళ్ల డిమాండ్ ఎలా ఉంటుందన్నది చెప్పాల్సిన పని లేదు. హీరోయిన్ అడిగినంత నిర్మాత ఇవ్వాల్సిందే. ఇంకా అదనంగా ఖర్చులు భరించాలి. ఒక్క రూపాయి కూడా వదలకుండా ముక్కుపిండి మరీ వసూల్ చేస్తారు. ఈ విషయంలో హీరోయిన్లు అంతా దాదాపు ఒకే తీరున ఉంటారు. హీరోయిన్ల తీరుతో విసిగిన నిర్మాతలెంతో మంది. వచ్చిన ఫిర్యాదులు ఎన్నో ఉన్నాయి. అలాగని అందరూ డబ్బు కోసమే పనిచేసే హీరోయిన్లు కారు. కొంత మంది కథా బలం ఉన్న చిత్రాల మోజులో పారితోషికం గురించి పెద్దగా పట్టించుకోరు. అలాంటి వాళ్లలో కీర్తి సురేష్ ఒకరని తెలుస్తోంది. %-%మహానటి%-% తర్వాత కీర్తి ఎంత పెద్ద స్టార్ అయిందన్నది చెప్పాల్సిన పనిలేదు. నిజంగా ఆనాటి మహా నటిని అభిమానించినట్లే తెలుగు ప్రేక్షకులు కీర్తిని అభిమానించారు. దీంతో తనకంటూ ప్రత్యేకమైన ప్యాన్ బేస్ ఏర్పడింది.కానీ ఆ క్రేజ్ ను మాత్రం కీర్తి ఏమాత్రం ఎన్ క్యాష్ చేసుకోలేదు అన్నది అంతే వాస్తవం. కీర్తి స్థానంలో మరో నటి ఉంటే? కోట్ల రూపాయలు వెనకేసింది. కానీ కీర్తి మాత్రం ఆ ఛాన్స్ తీసుకోలేదు. ఎందుకలా? అని ప్రశ్నిస్తే తాను కేవలం కథకు..అందులో పాత్రకు మాత్రమే ప్రాధాన్యతి ఇస్తానంది. తాను ఏ సినిమా చేసిన ఆ రెండు చూసే సైన్ చేస్తానంది. పారితోషికం అన్నది చివర్లో డిస్కస్ చేసే అంశంగా చెప్పింది.దీంతో కీర్తి డబ్బు ఉమెన్ కాదని అర్ధమవుతుంది. సాధరణంగా ఏ హీరోయిన్ అయినా ముందు పారితోషికం గురించి మాట్లాడుతారు. ఆ తర్వాతే కథ గురించి డిస్కషన్ మొదలవుతుంది. కీర్తి తరహాలోనే మృణాల్ ఠాకూర్ కూడా డబ్బుకంటే కథకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తుంది. అందుకే వాళ్లకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.



చంద్రిక రవికి నో స్టాపింగ్

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com